వైభవంగా శివపార్వతుల కల్యాణం



మహమ్మదాబాద్ శివాలయంలో శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు

సాక్షి, నెట్‌వర్క్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం పలుచోట్ల శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మిడ్జిల్ మండలంలోని వేములలో శివాంజనేయస్వామి ఆలయంలో 29వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను మండపంలో పెట్టి వేదపండితులు కల్యాణం జరిపించారు. కల్యాణంను తిలకించుటకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు అయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బండలాగుడు పోటీలను నిర్వహించననున్నట్లు మాజీ సర్పంచ్ జంగయ్య తెలిపారు.

■ మహబూబ్‌నగర్‌లోని సింహగిరి శ్రీకామేశ్వరిసహిత ఐశ్వరేశ్వరస్వామి దేవాలయంలో గురువారం రాత్రి పార్వతి, పరమేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు. దేవాలయ సుందరీకరణ కమిటీ అధ్యక్షుడు పోల శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ మండల కేంద్రంలోని శివాలయంలో ఉదయం అభిషేకాలు చేసి శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఉషన్నగారి విష్ణు దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు.

■ గండేడ్ మండలంలోని శివాలయంలోనూ శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అంతర్‌గంగ లింగేశ్వరస్వామి దేవాలయం వద్ద లింగేశ్వరుడిని సల్కర్‌పేట్, గండేడ్, వెన్నాచేడ్, పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి, మన్సూర్‌పల్లి, బల్సూర్‌గొండ , రెడ్డిపల్లి గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఉపవాసాన్ని విడిచారు.

■ నవాబుపేటలోని కాశీనాథుని ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజామున వరకు స్వామి మహారుద్రాభిషేకం నిర్వహించి కల్యాణం జరిపించారు. సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహచారి, మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, వ్యాపార సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, నర్సింహగౌడ్, చంద్రశేఖర్, రాజు, ప్రకాష్, అబ్దుల్లా, నవనీత్, రవికిరణ్, రఘు, చందర్, రాజేష్, రాంమోహన్‌శర్మ, పాల్గొన్నారు.

■ భూత్పూర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, సురేష్‌గౌడ్, రాకేశ్‌గౌడ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

■ కొకుంట్ల మండల కేంద్రంలో, పుట్టపల్లిలోని శివాలయంలో అర్చకుడు మఠం సురేష్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మాజీ సర్పంచ్ స్వప్నకిషన్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమం కొనసాగింది. శివాలయ కమిటీ సభ్యులు, చెన్నకేశవస్వామి భజనమండలి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని సింహగిరిలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



నవాబుపేట శివాలయంలో..



కొకుంట్ల మండలం పుట్టపల్లిలో..



భూత్పూర్‌లోని రామలింగేశ్వర దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం

క్లుప్తంగా

వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



మహమ్మదాబాద్: వరిసాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి నరేందర్ అన్నారు. గురువారం లింగాయిపల్లిలో వరి పైర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చీడపీడ నివారణలో రసాయనిక ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం పైర్లు పొట్టదశలో ఉండడం మూలంగా పూర్తిస్థాయిలో నీరు పెట్టాలని ఆయన సూచించారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పంటలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈఓలు నిఖిత, అంజిలయ్య, చెన్నయ్య , సత్యయ్య ఉన్నారు.

బాధితులకు పరామర్శ



అడ్డాకుల: మండలంలోని రాచాలకి చెందిన దండు అంజనేయులు వ్యవసాయ పొలంలో డ్రోన్ స్ప్రేయర్‌తో మందులను పిచికారి చేస్తుండగా ప్రమాదవశాత్తు డ్రోన్ తగిలి ముఖానికి, చేతులకు గాయాలు కాగా బాధితుడిని గురువారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఆనందం రోడ్డు ప్రమాదానికి గురవడంతో బాధితుడిని పరామర్శించారు. ఇద్దరు బాధితులకు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, చక్రపాణిరెడ్డి, గంగిరెడ్డి, రాజాగౌడ్, చెన్నకేశవులు, రాము, కొండన్న తదితరులు ఉన్నారు.

ఇసుక డంప్ సీజ్



దేవరకద్ర రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను అధికారులు గురువారం సీజ్‌చేశారు. వారు తెలిపిన వివరాలు.. బండ్రవల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు పెద్దగోప్లాపూర్ శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో ఇసుక డంపు నిల్వఉంచాడన్న సమాచారంతో రెవెన్యూ, పోలీసు అధికారులు వెళ్లి చూశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను గుర్తించి సీజ్ చేశారు. అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయి



నవాబుపేట: క్రీడలు యువతలో క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. గురువారం మండలంలోని ఇప్పటూర్‌లో మండల స్థాయి వాలీబాల్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో ముందుకుసాగితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నవనీత్‌రావు, మాజీ సర్పంచ్ అబ్దుల్లా, రవికిరణ్, చెన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో గురువారం అమావాస్యను పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం లోకకల్యాణార్థం చండీహోమం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చలివేంద్రం ప్రారంభం



జడ్చర్ల టౌన్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకు వచ్చేవారు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. చలివేంద్రం ఏర్పాటుచేసిన బార్‌అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, మాలిక్‌షాకీర్, యాదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, కరీం, సాహితిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో అఖండ భజనలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయం, గుడిబావి శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు అఖండ భజనలు నిర్వహించారు. ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు జాగరణ కోసం దేవాలయంలోనే గడిపారు. అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయా దేవాలయాల వద్ద ఉపవాస దీక్షలో ఉన్న భక్తులకు దీక్షను విరమించడానికి అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

స్టడీ మెటీరియల్స్ ప్రాక్టీస్ చేయండి



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ప్రాక్టీస్ చేయాలని పదో తరగతి విద్యార్థులకు ముడా చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండ, ఎదిర, అప్పన్నపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదువుకుని వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సమయం ఎంతో విలువైందని, దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు రామస్వామి, శివశంకర్, సీహెచ్ జ్యోతి, సీహెచ్ మంజుల, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతు, రామాంజనేయులు, జి.రాములు, తిరుపతయ్యయాదవ్, సీఎంఓ బాలుయాదవ్, హెచ్‌ఎంలు అరుణకుమారి, ఫౌసియాభాను పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పరిసరాల్లో చెత్త ఉండటాన్ని గమనించి ఉపాధ్యాయులపై అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. వాటర్ ప్యూరిఫైర్ అయిన వేస్టేజీ నీటిని చెట్లకు పంపిస్తున్నట్లు ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధనను తెలుసుకున్నారు. ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎం చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఏబీసీ సెంటర్ సందర్శన

మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నిర్మిస్తున్న ఏబీసీ సెంటర్‌ను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సందర్శించారు. సెంటర్ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. సోమవారం నుంచి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ సతీష్ ఉన్నారు.

స్క్రాప్ ఆటోను పట్టుకున్న స్థానికులు

- పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

జడ్చర్ల టౌన్: స్థానిక హరిజనవాడ హైస్కూల్‌లో వినియోగంలో లేని పాత కంప్యూటర్ సామగ్రి, పుస్తకాలు, ఇతర స్క్రాప్‌ను అనుమతి లేకుండా తరలిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. గురువారం స్క్రాప్ దుకాణం వద్దకు ఆటోలో వాటిని తరలిస్తుండగా పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ జయప్రసాద్ అక్కడికి చేరుకొని స్క్రాప్ ఉన్న ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై ఎంఈఓ మంజులాదేవి హైస్కూల్‌కు చేరుకొని హెచ్‌ఎం గోవింద్‌నాయక్‌తో వివరాలు సేకరించారు. హైస్కూల్‌లో పెయింటింగ్ పనులు కొనసాగుతున్నాయని, అన్ని గదులను శుభ్రం చేస్తున్న క్రమంలో వినియోగంలోలేని వాటిని స్క్రాప్‌కు తరలించాలని ఉపాధ్యాయులందరూ తీర్మాణం చేశామని వివరించారు. కిచెన్‌షెడ్‌లో ఉన్న వినియోగంలోని లేని కంప్యూటర్ సామగ్రిని సైతం స్క్రాప్‌కు ఉపాధ్యాయులు పంపించినట్లు తెలిపారు. కిచెన్‌షెడ్‌ను వినియోగంతో తీసుకువచ్చేందుకే వాటిని తొలగించామని, ఎలాంటి దురుద్దేశ్యం లేదని ఆయన వివరించారు. వివరాలను డీఈఓకు ఫోన్‌ద్వారా ఆమె తెలిపారు. అనంతరం ఆమె పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని స్క్రాప్‌ను తిరిగి స్కూల్‌కు తెప్పించారు.



ఆటోలో తరలిస్తున్న స్క్రాప్

జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సైన్స్ ఫెయిర్‌ను ఎంపీడీఓ విజయ్‌కుమార్, హెచ్‌ఎం చంద్రకళ ప్రారంభించారు. విద్యార్థుల సృజనాత్మకత వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీడీఓ అభిప్రాయపడ్డారు. హైస్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

‘నవోదయ’ ఏర్పాటుకు స్థల పరిశీలన

గండేడ్: మండలంలో నవోదయ పాఠశాల ఏర్పాటుకుగానూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గురువారం ఆర్డీఓ నవీన్ మండల అధికారులతో కలిసి వరహగిరిపల్లిలో పర్యటించారు. పాఠశాల ఏర్పాటుకు 25 ఎకరాల భూమి అవసరం ఉండగా గతంలో జంగంరెడ్డిపల్లిలో స్థలాన్ని పరిశీలించారు. అయితే అక్కడ పూర్తిస్థాయిలో ప్రభుత్వ భూమి లేక, పాఠశాల ఏర్పాటుకు అనువుగా లేకుండాపోయింది. దీంతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మరోచోట భూమి ఉంటే చూయించాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డికి, రెవెన్యూ అధికారులకు సూచించారు. దీంతో సల్కర్‌పేట్ గ్రామ శివారులో వరహగిరిపల్లి వద్ద అసైన్డ్‌భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈవిషయాన్ని తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవి ఆర్డీఓకు సమాచారమిచ్చారు. ఈమేరకు ఆర్డీఓ నవీన్ వరహగిరిపల్లి చేరుకొని 58 సర్వే నంబరులో పాఠశాలకు కావాల్సిన భూమిని పరిశీలించారు. అనంతరం తాత్కాలికంగా పాఠశాల ఏర్పాటుకు కావాల్సిన వసతిని గండేడ్‌లో పరిశీలించారు. జాగృతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోప్రామ్ కేరళ పాఠశాలలో ఉన్న వసతిని తనిఖీ చేశారు. వీటికి సంబంధించిన నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు ఆర్డీఓ నవీన్ తెలిపారు. తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీమాధవి, ఆర్‌ఐ యాసిన్, జూనియర్ అసిస్టెంట్ రాంచంద్రయ్య ఉన్నారు.



వరహగిరిపల్లిలో పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ నవీన్ మండల అధికారులు

ప్రదర్శనలతో సృజనాత్మకత వెలికితీత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు అన్నారు. గురువారం ఆ కళాశాలలో సృజన టెక్‌ఫెస్ట్–2025 కార్యక్రమం సాగింది. ఈమేరకు కళాశాలలో పలు డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన విద్యార్థులు చేసిన సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. మెకానికల్, ఎలక్ట్రికల్, వంటి విభాగాల్లో పలువురు విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కొత్తదనం ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన పలు ఆవిష్కరణలు రాష్ట్రస్థాయిలో సైతం పోటీ పడేలా ఉన్నట్లు తెలిపారు.



సృజన ఫెస్ట్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్, తదితరులు

మట్టి తవ్వకాల అనుమతి రద్దుచేయాలని వినతి

అడ్డాకుల: మండల కేంద్రంలోని గుట్టపై చేపట్టిన మట్టి తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో మైనింగ్ ఏడీని కలిసి వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ స్టేజీ వద్ద జరుగుతున్న రోడ్డు పనులకు అడ్డాకుల సమీపంలోని గుట్ట(సర్వే నంబర్ 161) వద్ద మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతి కంటే ఎక్కువగా తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకాలపై విచారణ జరిపి అనుమతి కంటే ఎక్కువ తవ్వకాలు చేపట్టిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకో

వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవీపీఎస్ మండలాధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి కురుమయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

దేవరకద్ర/ భూత్పూర్: దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లిలో శుక్రవారం జరిగే వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయంగ్రామంలో జరిగే మల్లన్నస్వామి ఊరేగింపులో పాల్గొంటారని, అనంతరం గ్రామంలో సీసీ రోడ్డు, స్కూల్ ప్రహరీ, ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నిర్మాణాలకు భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. భూత్పూర్‌తో పాటు పోతులమడుగు, పెద్దతండా, చౌలతండా, ఎల్కిచర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు గిరి ప్రదక్షిణ

చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) మండల అధ్యక్షుడు శివన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

తిరుమలకు పాదయాత్ర

నారాయణపేట రూరల్: మండలంలోని శాసన్‌పల్లి గ్రామానికి చెందిన తిరుమల తిరుపతి పాదయాత్ర సమితి భక్త బృందం గురువారం తిరుపతి వేంకటేశ్వర స్వామి సన్నిధికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా నారాయణపేటలో రెడ్డి ఎలక్ట్రికల్ వర్క్స్ నిర్వాహకుడు, సత్యసాయి భక్తుడు నర్సింహారెడ్డి పాదయాత్రకు బయలుదేరే వారిని శాలువాతో సత్కరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మదీనా మసీదు ప్రాంతంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. వచ్చే నెల 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో సిబ్బంది తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటికొండలో విద్యుత్ సమస్య

- కాలిపోతున్న బోరు మోటార్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



తాటికొండలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేసుకుంటున్న రైతులు

భూత్పూర్: మండలంలోని తాటికొండలో విద్యుత్ సమస్య నెలకొంది. తరచూ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురి కావడం, రైతుల బోరు మోటార్లు కాలిపోతున్నాయి. నాలుగు నెలలుగా ఇదే సమస్యతో సతమతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ ట్రాన్స్‌ఫార్మర్ కింద 30 మంది రైతులు వరి నాట్లు వేశారని, తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికావడంతో వరి పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైతులే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను బిగించుకుంటున్నారని, ఫీజుల పోవడంతో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మరమ్మతులు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాలుగు విడతలుగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు

- హౌసింగ్ డీఈ నర్సింహులు

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి నాలుగు విడతలుగా బిల్లులు వస్తాయని హౌసింగ్ డీఈ నర్సింహులు తెలిపారు. గురువారం మండలంలోని దేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మార్చి 15వ తేదీలోగా ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించి బేస్‌మెంట్ పూర్తిచేస్తే మొదటి విడత బిల్లు అందిస్తామన్నారు. బేస్‌మెంట్ లెవల్‌కు రూ.లక్ష, లెంటల్ లెవల్ గోడలు పూర్తి చేస్తే రెండో విడత రూ.లక్ష, స్లాబ్ లెవల్‌కు మూడో విడతలో రెండు లక్షలు, ఇళ్లు పూర్తయితే నాలుగో విడత రూ.లక్ష అందించనున్నట్లు తెలిపారు. దేపల్లి గ్రామం మొడల్ విలేజ్‌గా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎంపికచేసి దాదాపుగా 143మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. ఇంటి నిర్మాణం విషయంలో తీసుకునే జాగ్రత్తలు ఆయన వివరించారు. ఎంపీడీఓ జయరాంనాయక్, దేపల్లి వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న హౌసింగ్ డీఈ నర్సింహులు